
చైతన్య జ్యోతి





భక్తా! భయపడకు.
ముక్తి నివ్వలేను. విముక్తిని ప్రసాదిస్తాను.

స్వామి సుందర చైతన్యానంద







వివేక వైరాగ్య నిలయం - సంగీత సాహిత్య సమ్మేళనం - చైతన్య సుందర మహోద్యమం.







Shudha and Sundara shall be
one in Krishna consciousness.

Swami Shudhananda Bharati

ఆత్మబంధువులారా !

ఓం నమో భగవతే వాసుదేవాయ.

చిద్రూప చైతన్యాన్ని అభిలషించి చలిని ఛేదించుకొని చిత్తూరుకి కదలి వచ్చిన చైతన్య ప్రేమబంధువులకు ఆశీస్సులు.

జగతికి చీకట్లు, జీవికి ఇక్కట్లు క్రొత్తవి కావు. జీవితాకాశంలో అంధకారం ఎప్పుడు అలుముకుంటుందో ఎవరికీ అర్థంగాని దారుణ పరిస్థితులలో మనకంటూ ఒక వెలిగే దీపం ఉండాలి. మనదంటూ ఒక వెలిగే కాంతి తోడు కావాలి.

ఆ జ్యోతి ఆరేది కాకూడదు. మారేది కాకూడదు. మారని, ఆరని జ్యోతి చైతన్యజ్యోతి.



చేత పట్టుకొని మెల్లగా నడిచిపోండి.
ఇందులో

"ఏకాంతం" - వత్తి
"Call to Life Divine" - చమురు
"సారతత్త్వోపదేశః" - జ్వాల

ఇక కావలసింది ప్రమిద ఒక్కటే. అది మీ హృదయమే.

ప్రేమతో
స్వామి సుందర చైతన్యానంద

ఏకాంతం

ఎందరున్నా, అందరున్నా, ఎవరైనా నిజానికి ఎవరికి వారే.
అందరూ ఏకాకులే. అందరిదీ ఏకాంతమే.
ఏకాకులైనా, ఏ కాకులైనా చికాకులు తప్పడం లేదు. ఛిద్రాలుతొలగడం లేదు. క్షుద్రాలు కరగడంలేదు. భద్రాలు వెలగడం లేదు.
ఈ ప్రపంచంలో ఎవరైనా బాటసారే.
ఈ జగతి ఎవరికైనా ఎండమావే.
ఆశలన్నీ అడియాసలే. విలాసాలన్నీ విషాదాలే.
యమునాతీరం ఎక్కడో తెలియదు. ఎవరికి వారే ఇక్కడ అని అందరికి తెలుసు.

చిల్లికుండలో ఎంత నీరు పోసి ఏమిలాభం? చెల్లిపోయే బంధాలను ఎంతగా పురిపెట్టినా ఏమి ప్రయోజనం? మళ్ళీ మళ్ళీ నింపడం కన్నా చిల్లి ఎక్కడుందో వెతుకు. నీళ్ళు కారిపోకుండా చూసుకో.

ఇది గాలిబ్రతుకు

వీచే గాలి మేఘాన్ని దూరంగా తరలిస్తుంది. పీల్చేగాలి ఒకనాడు ప్రాణాన్ని బహుదూరానికి తరిమేస్తుంది. శ్వాసలను మనం అరగదీస్తుంటే, ప్రాణాలు మనలో కరిగిపోతున్నాయి. దానితోపాటు మనసు మరిగిపోతోంది. బ్రతుకు తరిగిపోతోంది. శ్వాసలు అమృతాలు కావాలి. ప్రతి శ్వాసకు మనం ప్రాణం పోయాలి. మన ప్రాణనాథుడైన శ్రీకృష్ణదేవుని నామస్మరణతో శ్వాసలు అమృతమయ మవుతాయి. బ్రతుకు పారిపోతే పోనీ. భగవంతుడు జారిపోకుండా చూసుకోవాలి.

సమస్తం అస్తమయం

ఉదయాస్తమయాలు సూర్యచంద్రులకే తప్పడంలేదు.
ఉదయించిన మనం అస్తమించకుండా ఉండగలమా?
దీపం వెలుగుతూ ఉంటే తైలం తరుగుతూ ఉంటుంది. దీపశిఖ ఒరుగుతూ ఉంటుంది. తరిగిపోయే తైలం ఒక దశలో దీపాన్నే చీకటిలోకి తోసేస్తుంది. తరిగే కొద్దీ తైలాన్ని నింపుకుంటూ పోతే దీపం ఆరదు. చీకటి చేరదు.
ఆలోచనలు, యోచనలు, అలజడులు అంతరంగ పవనాలై ప్రాణదీపాన్ని అల్లలాడిస్తాయి. కొడిగట్టిస్తాయి. కాడిగట్టినట్లు ఆడి ఆడి బ్రతుకుబండిని వల్లకాటికి ఈడుస్తాయి.

ఆలోచనల్ని అమృతమయం చేసుకోవాలి. యోచనలన్నీ అర్చనలు కావాలి. అలజడులు అదృశ్యమై ఆరాధనలు శోభించాలి. భగవన్నామమే దానికి తరుణోపాయం. భగవత్స్మరణమే దానికి ఏకైక మార్గము.

ఇదం మాయామయం

దేహాలు శ్మశాన దిక్కుగా పయనిస్తున్నా సందేహాలు మనసుకు దూరం కావడంలేదు. మనసొక మాయానర్తకి. మనో నర్తకి నృత్యభంగిమల ప్రదర్శనలో కదిలాడే ఛాయలే సందేహాలు. సంశయాలు. సంకల్పాల సంతర్పణలు.
ఈ ప్రపంచంలో మనం బ్రతుకుతున్నాం. ఇక్కడ అంతా మనది కాదు. అంతా మనకు లేదు.
ఇక్కడ మనకు నచ్చేది సగం. నచ్చనిది సగం.
నచ్చేది రాగం. నచ్చనిది ద్వేషం.
రాగమున్న చోటికి పరుగులు తీస్తాం.
ద్వేషమున్న చోటినుండి దౌడు తీస్తాం.
రాగద్వేషాలను విడిచిపెడితే పరుగులు తీయనవసరం లేదు. ఎక్కడ కాలు పెట్టినా క్రింద పరుపులే ఉంటాయి. ప్రపంచం నేడున్న దానికన్నా నాలుగురెట్లు విశాలమవుతుంది (త్రిపాద స్యామృతం దివిః)

సమాహారాలు

ఏవో లేవని దుఃఖిస్తాం. అవి మనకు అవసరాలు కావని, కనుకనే అవి అందడం లేదని గుర్తించం.
అశల చిగుళ్లు తొడిగించుకుంటూ ఉంటే దుఃఖఫలాలు రాకుండా ఉంటాయా?
ఇదంతా పరమాత్మ కృప.
అందవలసిందంతా నీకు అందింది. అందుతూ ఉంది. అందబోతోంది.
ఇక్కడ మినహాయింపులుండవు. స్వార్థసొంపులు ఉండలేవు.
అందిన దానిని అర్థం చేసుకోలేక అసహ్యించుకొంటూ,
అందనిదానికి అనూహ్యంగా అగ్రులు చాస్తూపోతే,
బ్రతుకంతా నిరాశే నిలిచిపోతుంది.

సమాసనమే సమాచారం

మాటే రానపుడు పాట ఎలా వస్తుంది? ఆచారమే లేనపుడు ప్రచారమెలా సాగుతుంది?
"బుద్ధి" మొగుడికి "మనసు" పెంకిపెళ్ళాం.
ఒకరు చెప్పింది మరొకరు చేయనని బిగుసుకుంటే ఇక అక్కడ మిగిలేది దాంపత్యం కాదు. దహనం.
మనం చేసే ప్రతికర్మ ప్రేమకు వ్యక్త స్వరూపం కావాలి.

జ్ఞానానికి ప్రతిరూపంగా మిగలాలి.
ఇంతవరకు ఈ ప్రపంచంలో ఎవరు ఏది సాధించినా ప్రేమతోనే సాధించారు.
పరమాత్మ మనల్ని సేవకులుగా సృష్టించలేదు.
మనమే ఆ మహితాత్ముని మన ప్రభువుగా ఎన్నుకున్నాం.
అన్ని రూపాలు ఆయనివే. అన్ని కర్మలు ఆయన కొరకే. ఏది చూచినా, ఏదివిన్నా, ఏదితిన్నా, ఏది ఆఘ్రాణించినా, ఏది స్పృశించినా ఆ పరమాత్మ అవ్యక్త చైతన్యమే మనకు స్ఫురించాలి.
"నేను" పడిపోతే, "తాను" మిగులుతుంది. వెలుగుతుంది.
ఇదే కర్మయోగం... కర్మలలో యోగం. చక్కని ఆచారం. ఆచార్యులందించిన సమాచారం. సమజీవన సదాచారం.
విశాలమైన ప్రదేశంలోనే వాసుదేవుడు క్రీడిస్తాడు. మన యెదలను విశాలంగా మార్చుకొన్నప్పుడే ఆయన పాదాలు మనలో సుందరంగా కదుల్తాయి.

అదే నీవు

జేబులో పెద్దమొత్తాన్ని పెట్టుకొని నిద్రించినవాడు స్వప్నంలో బిచ్చమెత్తుకొంటున్నాడు. ఆకలితో అలమటిస్తున్నాడు. మరి, అతడు సుఖించేదెలా? దీనికి మార్గమేమిటి? మేలుకోవడమే. మేలు తెలిసేది అక్కడే.
ఏకాకృతిలో వెలిగేవాడు ఏకాంతరాముడు.

అతడు ఒంటరివాడు. కనుక అతని వద్దకు మనదీ ఒంటరి ప్రయాణమే.
ఏదివెలిగినా, దాని వెనుక వెలుతురు తానే. ఇది "అరచేతిలో అమలకం" లాంటి సత్యము. అందరికీ అవగతం కావలసిన నిత్య సత్యము.
"ఇది నా అరచేయి" అనుకొంటూ, "ప్రభాతే కరదర్శనం" అని పలుకుతూ ఉదయాన్నే అరచేతిని దర్శించుకుంటాం.
అరచేతిని చూస్తున్నపుడే, ఆ చేతిని మనకు చూపే వెలుతురు కూడా అక్కడ ఉంది అనే సత్యాన్ని మరువలేము. వెలుగు లేకుంటే చేయిని చూడగలమా?
కానీ, కాంతి చేతిని చూపెడుతున్న సమయంలో చేతిని క్రిందికి దించేశామనుకోండి. అప్పుడు కాంతి కూడా దూరమౌతుందా? ఆలోచించండి.
వెలుగు ఎప్పుడూ ఉంది. వెలిగించబడింది దూరమైనంత మాత్రాన వెలుగు దూరంకాలేదు. ఆ వెలుగే నీవు.

వెలిగేవి - వెలుగు

వెలిగే వాటికి వెలుగుకు తేడా ఏమిటో నీకు అర్థం కావాలి. అంతవరకు బ్రతుకులో వెలుగు రూపంలో చీకటే మిగులుతుంది.
ఈ రెండిటి మధ్య తేడాను గుర్తింపచేసేవే నిజమైన బోధలు. బోధలు చేసే పనినే బాధలు కూడా చేస్తాయి. బాధ ఏదో కాదు. బ్రతుకును భవ్యంగా మార్చుకోమని పరమాత్మ పంపిన బోధయే బాధ.
వెలిగేవాటిని విస్మరిస్తే నీవే వెలుగై నిలుస్తావు.

అది జాగ్రదవస్థ నుండి నిద్రలోకి పొరలడం వంటిది.
జడం నుండి చైతన్యానికి ప్రాకడం లాంటిది.
నేత్రాలు మూసి పడుకున్న నిన్ను నిద్ర తన ఒడిలోకి తీసుకొనునట్లు, అంతర్ముఖుడవై ధ్యానంలో నిలిచిన నిన్ను పరమాత్మ తనలోకి తీసుకుంటాడు.

ఆచార్యుని ఆదర్శం

చెప్పింది అర్థం కానపుడు చేసి చూపడమే సముచితం.
గురువులు చేసి చూడమంటారు. అలా కానపుడు, చేసి చూపిస్తారు.
అలా చేయడానికి
వారు చరించ నవసరంలేదు. చలించ నవసరంలేదు (చరిస్తే తప్పుకాదు)
సూర్యుడు, చంద్రుడు, తారకలు మన జీవనానికి ఎంతో ఉపకరిస్తున్నాయి. ఉన్నచోటనే ఉండి మన ఉనికికి ఉపకరించడమే వాటి ఔన్నత్యం.
ఊడిగం చేయడం వెనుక వైభవం ఉనికి లోనే ఉంది.
ఏమీ చేయక పోయినా అంతా చేయడమే అవుతోంది. లేకుంటే,

ఆత్మ సంస్థం మనః కృత్వా న కించి దపి చిన్తయేత్

"మనస్సును ఆత్మయందు నిలిపి ఏ కొంచెమైనను చేయకుండా ఉండిపో" అని గీతాచార్యుడు ఎందుకు చెబుతాడు?
అలా వెలిగిన అమర దీపాలే మహర్షులు. గురువులు.

ఇదిగో రామకృష్ణ జ్యోతి.



అదిగో రమణ పరంజ్యోతి.



అన్నీ శంకర దీపాలే. శివశంకరి రూపాలే.
మరి నేను

మాధవ చైతన్యంలో మధుమాసాన్ని
సుందర చైతన్యంగా సహవాసాన్ని.
ఇది నిజం . ఇదే నా నైజం.
నేను గురువును కాను. గుర్తులు వదిలే వాణ్ణి.
నేను ఆచార్యుణ్ణి కాను. అలజడి సృష్టించేవాణ్ణి.

నాదొక వినూత్నమైన సందడి.
నాదొక విచిత్రమైన అంగడి.
కృతజ్ఞతతో మీరు స్పందిస్తున్నారు. ప్రతిస్పందించలేని అశక్తతలో నేను సాక్షినై వీక్షిస్తున్నాను.
"సంతకెళ్ళాలి. పూలు అమ్ముకోవాలి. ధనం గడించాలి. ఆకలి తీర్చుకోవాలి" అని ఒక తోటమాలి పూలబుట్టను తలపై పెట్టుకొని ఒక వీధి గుండా వెళ్తూవుంటే, ఆ వీధిలోని వారికి పూలవాసన రావచ్చు. సంతసించిన ఆ జనం "థాంక్స్" అని స్పందిస్తే, తోటమాలి ఎలా ప్రతిస్పందించాలి?
"అయ్యా! పువ్వులను అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని నేను సంతకెళ్తున్నానే గాని మీకు సువాసనను అందించాలని నేను ప్రయత్నించ లేదు. నేను పోతూ ఉంటే, సౌరభాన్ని మీరు ఆఘ్రాణించారు. ఇక్కడ నా త్యాగమేమీ లేదు. నేను ప్రతిస్పందించలేకున్నాను" అంటాడు తోటమాలి.
నేనూ అదే అంటున్నాను. నా ముక్తికొరకు నేను నడిచే దారుల్లో నాకు తోడైన మీకు నానుండి ఏవో దొరికి ఉండవచ్చు. అదంతా మీ కొరకు నేను చేసింది కాదు. నా కొరకు నేను చేసుకున్నదే. మీ కృతజ్ఞతలతో నా గమనాన్ని ఆపకండి. నన్ను సాగనివ్వండి; అని అంటున్నాను.
మకరందాన్ని భృంగాలకు అందించాలని పద్మము విరబూయలేదు. కనుక తుమ్మెదలు "ఝు"మ్మని స్పందిస్తే పద్మము ప్రతిస్పందించదు. కమలము ప్రతిస్పందిస్తే, తుమ్మెదలతో కాదు. తన బంధువుతో. తన ఆప్తునితో.

కమల బాంధవునితో. కమలాప్తునితో.

"నీ కిరణ ప్రసార ప్రసాదమే నాకు ముక్తిని ప్రసాదించింది. నీవు తలుపు తీయబట్టే తుమ్మెదల తలపులు పండాయి" అని నింగిని చూసి వంగి నమస్కరిస్తుంది కమలం.

దయాసాగరుడైన పరమాత్మ కృపావీక్షణ కిరణాలను తలుచుకుంటూ, తలపోసుకుంటూ, తల నింపుకుంటూ "తండ్రీ! తవదాసోహం" అని నేను ఐదు పది చేస్తున్నాను.

ఇది ఒంటరివాని వద్దకు నా ఒంటరి ప్రయాణం.
రాళ్ళు విసిరిన వారిని విమర్శించే దుండదు.
పూలు చల్లేవారిని పరామర్శించే దుండదు.
నాలో నేను నన్ను చేరే ప్రయత్నంగాని ప్రయాణంలో అందరికీ నా ప్రణామాలు. యాభైలోకి ఏగుతున్న దశలో యెద అందిస్తున్న ప్రమాణాలు.

నమస్తే సమస్త ప్రపంచ ప్రభోగ ప్రమాణ ప్రవీణ.... నమస్తే....

అయితే, మీరు
మీరే నిర్ణయించుకోవాలి.
ప్రగతి లేకపోవడానికి మన ప్రవర్తనే ప్రతిబంధకమని గుర్తించాలి.



మీరు సత్సంగ సభ్యులు.
సుందరచైతన్య మహోద్యమ శరీరంలో అవయవాలు.
అవయవాలు ఆరోగ్యంగా ఉంటేనే ఆకృతి నిలుస్తుంది.
దేహంలో గుండె ఉంది. కఫమూ ఉంది.
ఊపిరితిత్తులున్నాయి. వాతమూ ఉంది.
మెదడు ఉంది. పిత్తమూ ఉంది.
మరి, మీరెలా ఉంటారు?
ఎలా ఉంటే మీరు మీరుగా ఉంటారో అలా ఉండండి.
మరోలా ఉంటే, క్షీణించేది ఆరోగ్యమే.
నేను నిరామయుణ్ణి నమ్ముకున్నవాణ్ణి. ఆరోగ్యాలు, అనారోగ్యాలు నా మార్గానికి ప్రతిబంధకాలు కావు.
ఏవైనా మీ ప్రగతికి సోపానాలు కావాలే కాని అడ్డుగోడలు కాకూడదు.
మీ స్వేచ్ఛకు నేను ఎన్నడూ అడ్డుగా లేను. అడ్డు కాను.

తెడ్డు వేసుకొంటూ నావను నడుపుకు పోయే నావికుణ్ణే కాని, ఎవరు ఎక్కుతున్నారు? ఎవరు దిగుతున్నారు? అని పట్టించుకొనే 'సంచారి' ని కాను.

ముందు చూపుతో బండిని నడుపుకు పోయే "డ్రైవర్నే" కాని జమా ఖర్చులు చూసుకొనే "కండక్టర్ని" కాను.

చెప్ప దలచుకున్నది చెప్పేశాను.
చెప్పదగింది మాత్రమే ఇక చెప్తూ ఉంటాను.
చేయగలిగిందంతా చేసేశాను
చేయదగింది మాత్రమే ఇక చేస్తూ ఉంటాను.
నాకు బదిలీ అయింది.
చేసే "పని" నుండి చూసే "స్థితి"కి.

ఇక ఉంటాను, ఏదైనా వింటాను.
వింటూ ఉంటాను
ఉంటూ వింటాను.



శుభమస్తు

The Call for the Divine

Beloved devotees of Lord Sri Krishna ,

OM Namo Bhagavate Vasudevaya.

The worldly life is a light and shade of weal and woe. Waste not precious life in falsehood, slaughter and gossip.

You have a will; yet you do not discern.
Unless you taste a thing you cannot know its sweetness. The Divine must be seen and felt as He is.

O Children of Rishis !

Take hope ; live long !
Let us think and think,
feel and feel,
melt and melt !
Come, let us drench and drench our body with tears flown from the brimming fount of love !

Let our hearts melt and eyes rain in love of Him. Take refuge in Him. This is what I repeatedly say. Believe my word ! mistake me not !

Your obdurate heart may not understand me. But my words shall have their fulfilment.
Mine is the word that the immortal seers and saints speak.
My pages have the stamp of the sages.
I shall not leave my grip ;
I shall not loose my hold.
I have no desire for earth and wealth.

I am ever with thee !
My love shall pour into thee !
All should enjoy the blessing He has showered upon me.
Love is my loud-speaker.

Beloved embodiments of Divine :

The light is with in you. Would you fall into the dark well even with a torch in hand burning bright ?
I cannot bear the pitiable cries of my people on any account.
It is time !
The time is opportune !
The time is ripe !

Come, my people, come quick as I expect. Please listen. In my path consider me as one among you.

It is hour that Lord Syama Sundara comes to reveal the truth. If you follow carefully you will attain a new life.

Aspire !
Reflect !
Melt !
Love people; Love all ; but don't believe them. The worldly- minded people are dark within, seeming white without.

Set your mind only in the Divine. He helps you even before you expect.

Beloved friends,

Don't think much of yourself.
Don't get angry with any.
Don't touch impurities.
Hurt not: Wound not.
Be truthful ; melt and meditate.

Have no faith in the inventions of sectarian religions and newly - fashioned cults. Cast away all frivolities.

To regain the Divine in the self is our great aim. I refer to the (One) great sentence "తత్త్వమసి (Tatwamasi)" "Thou art That" - the holy sentence that inspired and enlightened our great ancestors from time immemorial. Let us also follow the same.

ఏష పన్థా మహర్షీణాం ఫలాన్యా హారతాం వనే

" This is the path followed by great sages gathering fruits in the forest."

This is the ringing Voice of renowned poet- seer Valmiki and the inspired voice of immortal seer- poet Vyasa.

This is the only eternal message of the Rishis of Yore that echoed from the Naimisa forest resort, from the Himalaya mountain solitudes and also from the holy ganges luxuriant river banks garlanding this Sunny Bharatiya Arsha Dharma.

See yourself revealed every where.
It is the Climax of my teaching.

The age for the Hindu renaissance movement has dawned. I hoist the flag of Sanatana Dharma, the flag of self- unfoldment.

I prepare the path for the royal march of a new conquering force that shall leave suspicion, envy, greed, division and strife far behind it.

Bhagavan Sri Krishna leads us.

Simply go where He leads. We are merely His instruments. His Divine power is at work to help us. Simply obey it. He is our only hope and salvation.

By His Grace, Let us soon walk in the pure spiritual path of His Light and Grace.

Remember Him always. Continuous remembrance of God is the only way to realise Him.

Come ye who are earnest, come with love.
Let our mouths water to hail His glory.

I cannot bear a moments' delay. If you say "after wards" upon my word I cannot bear to wait.
Earth sleeps.
Hill sleeps.
The restless - sea sleeps .
All other things in the world sleeps ;
but I do not sleep.

I wish to bring light and delight to all that move in my beautiful spiritual gathering. This is my aspiration. Let the world say anything.

My love swells beyond control.
Come ! Come !

Melt and melt in love.
Meditate and meditate !

If you apply yourself to sadhana as your Guru directs, you need not suffer like others.

Doubts are no more.
I am with you, always with you.

Hail Supreme Light Divine !
Hail Supreme Grace Divine!

I pray to the Almighty Lord to create unflinching devotion in the minds of you all so that you may have His name always on your tongue and His beautiful form always in your heart and ultimately enjoy His Grace and Bliss.

Om Tat sat

సారతత్త్వోపదేశః

మూలం:
ఆది శంకరాచార్యులు

వ్యాఖ్య:
స్వామి సుందర చైతన్యానంద

శ్లో॥ గురుర్బ్రహ్మ స్వయం సాక్షాత్ సేవ్యో వన్ద్యో ముముక్షుభిః నోద్వేజనీయ ఏవాయం కృతజ్ఞేన వివేకినా 1

గురుదేవుడు సాక్షాత్తు బ్రహ్మస్వరూపుడు. ముముక్షువులకు భజనీయుడు. వందనీయుడు. వివేకము, కృతజ్ఞత గల శిష్యుడు గురువును ఎన్నడూ బాధ పెట్టకూడదు.

వ్యాఖ్య

గురువు గోచరుడు. బ్రహ్మ అగోచరుడు. గురువు శరీరి. బ్రహ్మ అశరీరుడు. కాని, గురువు సాక్షాత్తు బ్రహ్మ స్వరూపుడు అనగానే గురువు కూడా అగోచరుడుగా, అశరీరిగా మారుతున్నాడు.

గురువును వ్యక్తిగా చూచేవారు ఎన్నడూ శిష్యులు కాలేరు. గురువు వ్యక్తి కాదు. శక్తి. జీవనశక్తి. జీవికి శక్తి.

గురువు మనలాగే గోచరించవచ్చు. మనలాగే భాషించవచ్చు. భుజించవచ్చు. భజించవచ్చు. అంత మాత్రాన మనలాంటివాడేనని భావించకూడదు. అతడు వ్యక్తిత్వము నధిగమించిన వ్యక్తి. వ్యక్తిని మించిన శక్తి. ఒక రాజుగారు తన అంతఃపురములోనే ఉన్నా, అతని ఆజ్ఞలు దేశమంతా అమలు చేయబడినట్లు, గురువు దేహంలోనే గోచరిస్తున్నా, అతని శక్తి యావత్ప్రపంచాన్ని శాసిస్తుంది.

గురువు వ్యక్తి అయితే, నీ ఊహ అతనిని పట్టుకోగలదు. గురువు శక్తి అయిననాడు నీ మనసు ఆ మహిమను అర్థం చేసుకోలేక మూగబోతుంది. గురువు విషయంలో నీ మేధస్సు, నీ ప్రజ్ఞ ఎందుకూ కొరగావు. సముద్రాన్ని ఆపోశనం పట్టాలనే ప్రయత్నం లాంటిదే గురువును అర్థం చేసుకోవడం.

ఊహాకందని భగవంతుని విషయంలో అశక్తులమై శరణాగతుల మవుతున్నాము. పరమాత్మను సేవిస్తున్నాము. చేతులెత్తి నమస్కరిస్తున్నాము. గురువు విషయంలో అదే చేయాలి. ఇదే శిష్యుని విషయంలో వివేకం. ఇదే కృతజ్ఞత.

గురువు బాధపడే పనులు శిష్యులు ఎన్నడూ చేయకూడదు. అంటే, నీ, నా, పిచ్చిపనుల వల్ల, పిచ్చిపాటల వల్ల గురువు బాధపడతాడా? బాధపడేవాడు గురువు ఎలా అవుతాడు? బోధరూపుడైన వానిని బాధించే శక్తి ఎవరి కుంటుంది? ఇక్కడ గురువును బాధించడము అంటే, గురుభాస్కరునికి తెరవేసి చీకటిలో అలమటించడ మని అర్థము. మనము ఎక్కియున్న కొమ్మను స్వహస్తాలతో ఖండించడ మని భావము. ఈ పనిని వివేకి చేయడు. కృతజ్ఞుడు చేయలేడు.

సేవాభిః పరితోష్యైనం చిరకాలం సమాహితః సదా వేదాన్త వాక్యార్థం శృణుయాత్సు సమాహితః

"శిష్యుడైన వాడు గురువును సేవాదుల చేత తృప్తిపరచాలి. గురువు చెంత ఎక్కువ కాలము సావధానచిత్తుడై, ఏకాగ్రత కలిగి వేదాంత వాక్యాలను నిత్యము శ్రవణము చేయాలి" అన్నది ఉపనిషత్తు.

శ్లో॥ యావదాయుస్త్రయో వన్ద్యో వేదాన్తో గురురీశ్వరః మనసా కర్మణా వాచా శ్రుతేరేవైష నిశ్చయః 2

జీవించి యున్నంతకాలము మూడువేళల త్రికరణశుద్ధిగ వేదాంతమునకు, గురువునకు, ఈశ్వరునకు నమస్కరించాలి. ఇది శ్రుతిమాత ప్రబోధము.

వ్యాఖ్య

జీవులు ఈ ప్రపంచంలో జీవించేది మరణించేందుకు కాదు. అమృతులుగా మారి తరించేందుకు.

ఈ మహా ప్రయాణంలో ప్రమాణము శాస్త్రము. ప్రమాణము నందించి నడిపే పవిత్రాత్ముడు సద్గురువు. నడిచి సాధించవలసిన గమ్యము భగవంతుడు.

ఈ మూడే జీవితంలో ప్రధానమైన విషయాలు. ఈ మూడింటిని మూడువేళల స్మరించమంటున్నారు. అంటే, త్రికాలము లందు హృదయంలో ఇవే ఉండాలి. ఇవే నిండాలి అనేది నిగూఢార్థం.

ఈ విషయంలో రాజీలు పనికిరావు. కనుకనే త్రికరణ శుద్ధిగా సేవించమంటున్నారు శ్రీ శంకర భగవచ్చరణులు.

శ్లో॥ భావాద్వైతం సదా కుర్యాత్ క్రియాఽద్వైతం న కర్హిచిత్ అద్వైతం త్రిషు లోకేషు నాఽద్వైతం గురుణా సహ ॥ 3

అద్వైతమును సదా భావంలోనే ఉంచుకోవాలి. క్రియలలో అద్వైత భావమును ఉంచకూడదు. ముల్లోకముల యందును అద్వైత భావమును కలిగి యుండవచ్చు. కానీ గురువు విషయంలో "అద్వైతం" చూడకూడదు.

వ్యాఖ్య

ప్రపంచం ఉండవచ్చు. కానీ దానిని గ్రహించే నీకన్నా వేరుగా ఉండలేదు. అది - ఇది, అక్కడ - ఇక్కడ, అప్పుడు - ఇప్పుడు అనేవి తెలుస్తుండినా ఇవన్నీ చైతన్యము యొక్క పరిధిని అధిగమించలేవు. ఖండాలుగా తెలిసే వన్నీ అఖండ చైతన్యములోనే ఒదిగి ఉన్నాయి. ఈ అఖండ చైతన్యమే సత్యము. ఇదియే అద్వైతము. అద్వైతము అనుభూతిగా మిగిలిననాడు ద్వైతప్రపంచము జారిపోతుంది,

సర్వప్రపంచోపశమే అద్వైత సిద్ధిః

"సమస్త ప్రపంచము ఉపశమించడమే అద్వైతము సిద్ధించుట" అని శ్రీశంకరుల మాండూక్యకారికా భాష్యము.

ప్రపంచము ద్వైతము. ద్వైత ప్రపంచము మనసుకు మాత్రమే తెలియుచున్నది. కనుక అది భావనా ప్రపంచము. ఆలోచించే బుద్ధికన్నా వేరు కానిది; వేరుగా లేనిది. అందుచేత, ఈ దృశ్యమాన ప్రపంచము మనో సంకల్ప ప్రభావమే.

మనో వికల్పనా మాత్రం ద్వైతం ఇతి సిద్ధం

అంటూ ద్వైతాన్ని కేవలం బుద్ధియొక్క ఊహగా నిర్ణయించారు ఉపనిషద్భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి.

ప్రపంచ భావన ఉన్నంతవరకు అద్వైతం సిద్ధించలేదు. ద్వైత భావనా కాలుష్యాన్ని కడిగేసుకొనే ప్రయత్నంలో సాధకుడు అద్వైత భావనను మనసుకు పట్టిస్తున్నాడు. అద్వైతము స్థితియే గాని, మతి కానందున, అది భావ పరిధిలోకి రాదు. ఇక్కడ సాధకుడు పవిత్రమైన అద్వైత భావన చేత మనస్సును శుద్ధి చేసుకుంటున్నాడు. అంతే.

అద్వైత భావన అనేది ఉన్నంతవరకు బాటలోనే ఉన్నాడు శిష్యుడు. బాటలో ఉన్నంతవరకు గురువు ఆవశ్యకత ఉండనే ఉంది. కనుక గురువులో అద్వైతమును దర్శించడము వలన కాళ్ళు కట్టేసుకొని పరుగులిడే ప్రయత్నమే అవుతుంది. కనుక, అద్వైతమును అంతటా భావించినా, గురుదేవుని విషయంలో అది పనికిరాదు అంటూ గురువైభవాన్ని అద్భుతంగా కీర్తిస్తున్నారు ఆచార్యులు.

త్రాతా చ కః? స గురుః

"రక్షించువాడెవరు? గురుదేవుడే".....ఇది సత్యము. ఇది సత్యము. ఇది ముమ్మాటికి సత్యము. అద్వైతమును ఆవిష్కరించుకొని రక్షించేవాణ్ణి దూరం చేసుకుంటే, దగ్గరుండే దుఃఖ దారిద్ర్యము తొలిగేదెలా! ఆలోచించండి.

యస్యదేవే పరాభక్తిః యథా దేవే తథా గురౌ తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః

"ఎవనికి దేవుని యందు గల పరాభక్తి గురువు నందు కూడా ఉండునో, అట్టివానికే బోధించిన విషయాలు తెలియును" అని సురేశ్వరాచార్యుల మానసోల్లాసము. అదే మనకూ హృదయోల్లాసము.

ఇతి శ్రీశఙ్కర భగవత్పూజ్యపాద విరచిత సారతత్త్వోపదేశః

ఇది శ్రీ శంకర భగవత్పూజ్యపాదులు రచించిన సారతత్త్వోపదేశము



గుండెగుండెను గుడిగా మార్చి, ఓర్పుతో, నేర్పుతో జ్ఞానదీపాలను వెలిగించే చైతన్యజ్యోతి.